


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**అయ్యా సంకల్పించిన యాగం** నిర్విఘ్నంగా సమాప్తమైంది" ఒక్క ముక్కలో కొలువు దీరిన వారందరికీ చెప్పాడు శృంగి.

"బాగుంది. మంచి కబురు. ఇప్పుడు ఒక్క విషయమూ పొల్లుపోకుండా అన్నీ వివరించు" వీరాసనంలో కూర్చుని విశ్రాంతిగా అన్నాడు రామజోగి. జయ్, రాబీ, పరమేశ్వరశాస్త్రి, యజ్ఞప్ప, మదాలస, సుదర్శన్, శ్రీనివాస్, శరద్వతి, అందరూ వినడానికి శ్రద్ధతో కూర్చున్నారు. శ్రీనివాస్ తల్లిగారు అందరికీ కాఫీ ఇచ్చింది. శృంగి, మట్టులతో సహా. మట్టు శాస్త్రిగారి పాదాలకు నమస్కరించాడు.

"మట్టూ, నువ్వు మొదలెట్టు" శృంగి మట్టుతో అన్నాడు.

"అయ్యా..యజ్ఞం అతి సామాన్యమైనదని మేము ముందుగా భావించినా, చివరికి అదో అసాధారణమైనదనీ, అత్యంత శ్రేష్టమైనదనీ, దానికి మానవ ప్రయత్నమే కాకుండా, ప్రకృతి సహకారమూ, భగవంతుని కృప మెండుగా వుండాలని అర్ధమైనది. నివృత్తి యాగం భగవంతుని కృపతో పూర్తి అయింది. యాగ ప్రారంభంనుంచీ జరిగిన విశేషాలు ఏమంటే... "మొత్తం రెండుగంటలపాటు పూసగుచ్చినట్టు నిరాఘాటంగా వివరించాడు మట్టూ. సంకల్పానంద తన

శేషజీవితాన్ని శిథిలాలయం వద్దే గడుపుతానని అన్నారనీ, అరిదమన అలంబసులు ఆ నిర్ణయానికి హర్షించారని కూడా వివరించాడు. అరిదమన అలంబసుల మధ్య జరిగిన మహాభారత యుద్ధ చర్చని కూడా పొల్లుపోకుండా చెప్పాడు. ఆద్యంతం అందరూ ఏకాగ్రతతో విన్నారు. అంతా నిశ్శబ్దమే. ఆ నిశ్శబ్ధంలో ఓ ఆశ్చర్యం, ఓ ఆందోళన, ఓ ప్రళయ భీతి తొణికిసలాడాయి.

ఓ యజ్ఞం పరిసమాప్తం అయిందంటే అర్థం ఓ మహా కార్యం ప్రాంభం అయిందనడానికి సూచిక. ప్రతిదానికీ ఓ ఆరంభం అంతం రెండూ వుంటాయి. ఇదో సైకిలు చక్రంలాంటిది. గుండ్రంగా తిరుగుతూనే ఉంటుంది. ఆ సంగతి పక్కన పెడితే, శతృవు ఎవరో తెలియదు. శతృవు బలమెంతో తెలీదు. ఏ ఆయుధాలతో ఎప్పుడు వస్తాడో తెలీదు. అక్కడక్కడా కొన్ని సంఘటనలు జరిగాయి. రాబీ చెప్పిన స్వప్న వృత్తాంతం ప్రకారం రాబోయే ప్రళయానికీ మహాభారతానికీ లింక్ ఉంది" ఆగారు పరమేశ్వర శాస్త్రిగారు.

"ఎలా?" అడిగాడు శ్రీనివాస్.

"మట్టు చెప్పిన అలంబసుల వారి గత జన్మ అనుభవం. నివృత్తి యాగానికి ముందు దొరికిన రంగులు వెదజల్లే అద్భుతశిల. సంకల్పానంద తన శేషజీవితాన్ని అక్కడే గడపడానికి నిశ్చయించుకోవడం. ఆయన నాకు పరిచయమే. తన కుటుంబం అంటూ ఏమీలేని ఓ విరాగి. కానీ, అతనికి కాశీ అంటే ప్రాణం. ఆ కాశీని వదిలి కారడవిలో వున్న శిథిలాలయంలో ఉండడానికి కారణం ఏముంటుందీ? బహుశా అమ్మవారి ఆజ్ఞ అయివుంటుంది. ఓయీ శ్రీనివాసా, లోకంలో ఏచోటినించైనా సూర్యుడ్ని, చంద్రుడ్నీ, ఆకాశాన్నీ, నక్షత్రాల్నీ చూడొచ్చు. ఎక్కడినించి చూసినా అవి ఒకలాగే కనబడతాయి. అలాగే అమ్మవారి స్వరూపాలు. విగ్రహాల నిర్మాణంలో తేడాలుండొచ్చు. ఆ వెనకవుండే శక్తి మాత్రం ఒకటే. ఖచ్చితంగా అమ్మ ఆజ్ఞ మాత్రమే సంకల్పానందని ఆపగలదు" వివరించారు శాస్త్రిగారు.

"మన కార్యక్రమం ఏమిటి? కొంత అసహనంగా అన్నాడు రాబీ.

"తెలియదు" స్పష్టంగా అన్నారు శాస్త్రిగారు.

"మరి అప్పుడు ఈ పనికిమాలిన చర్చలతో లాభం ఏమిటీ?" సీరియస్‌గానే అన్నాడు రాబీ.

"కొన్ని సంఘటనలని విశ్లేషించడం చర్చకిందకి రాదు. రాబీ ఇది వ్యక్తులమధ్య నడుస్తున్న కథకాదు. దేశాలమధ్య నడుస్తున్న కథ అంతకన్నా కాదు. మరో విషయం ఏమంటే, ఎవరు ఎన్నాళ్ళు ఎక్కడ వుండాలో ఎవరు ఏ కార్యక్రమాన్ని చేపట్టాలో కూడా తెలియదు. చదరంగంలో ఇరు పక్షాలు ఎత్తుకి పయ్యెత్తు వేస్తూ ఎదటివారి సైన్యాల్ని నిర్జిస్తూ ఉంటాయి. ఓ పక్షం గెలుస్తుంది. మరో పక్షం ఓడిపోతుంది. కానీ రాబీ. ఇన్ని యుద్దాలు జరుగుతున్నా చదరంగం 'బోర్డు' మాత్రం ఏమాత్రం చలించదు. గెలుపోటములు ఏనాడూ దానికి పట్టవు. కాలమూ చదరంగం బోర్డులాంటిదే, న్యాయాన్యాలు, ధర్మాధర్మాలు ఏవీ దానికి పట్టవు. దాని దారిన అది సాగిపోతూనే ఉంటుంది. ఎవరు ఎప్పుడు ప్రవేశించాలో,

నిష్క్రమించాలో కూడా నిర్ణయించేది కాలం కాదు. ప్రస్తుతం అందరం ఇక్కడవున్నాం. ఎందుకున్నామో, ఎన్నాళ్ళుంటామో తెలియదు. ఎవరికి వారు సెలవు తీసుకుని వెళ్ళిపోవాలన్నా, ఎవరినించి ఎవరు శలవు తీసుకోవాలీ?" మాటలు ఆపారు శాస్త్రిగారు.

ఏం మాట్లాడాలో ఎవరికీ అర్ధంకాలేదు. మదాలస పెదాలమీద ఓ చిన్న చిరునవ్వు కదలాడింది. అదే సమయంలో సుదర్శన్ ఆమెని చూశాడు.

"ఎందుకు నవ్వారు?" మదాలసతో అన్నాడు సుదర్శన్.

"ఎవరు ఎవరి దగ్గర్నించి సెలవుతీసుకోవాలో కూడా తెలియదు" అన్న శాస్త్రిగారి మాటకి నవ్వాను. నిజం చూడండి సుదర్శన్.. అసలు మనకి ఏం తెలుసూ, నేను పుట్టినదగ్గర్నించి ఆల్మోస్ట్ మీరంతా మా యింటికి వచ్చేవరకూ మీరెవరో నాకు ఏం తెలుసు? మీ అందరితోబాటు ఇక్కడికొస్తానని కనీసం వూహించనుకూడా లేదుగదా! అందరం ఒకే చోటవున్నాం. మనం సంకల్పించుకుని ఇక్కడికి రాలేదు. కొన్ని నెలల క్రితం ఎవరెవరో కూడా ఎవరికీ పెద్ద తెలీదు. 'రాక' మన చేతిలో వుంటేగా సెలవు తీసుకుని 'పోయే' విషయం తెలియడానికీ" మళ్ళీ చిన్నగా నవ్వింది మదాలస.

"ఓహ్.. ఇక్కడున్నారా" వారిని సమీస్తూ అన్నాడు జయ్.

"కూర్చునీ కూర్చునీ విసుగుపుట్టి వాకింగ్‌కి వచ్చా. ఇక్కడ మదాలసగారు కనపడ్డారు" వివరించాడు సుదర్శన్.

"నేనూ అందుకే బయట పడ్డాను. ఇల్లు వదిలి నెలలు అయింది" నిట్టూర్చి అన్నాడు జయ్.

"మొత్తం కథ మొదలయింది మీరు ఏర్‌పోర్ట్‌కి వెళ్ళి రాబీని రిసీవ్ చేసుకున్నప్పటినించేగా!" అన్నాడు సుదర్శన్.

"అవును. చిత్రం ఏమంటే రాబి చదరంగంలో ఓ పావులాంటివాడు. విలియమ్స్ సూత్రధారి అని నాకు గాఢంగా అనిపించేది. అతనికి భూత భవిష్యద్వర్తమానాలు తెలుసనే శాస్త్రిగారన్నారు. ఇప్పుడు అతని ఆత్మ ఎక్కడ ఏం చేస్తోందో ఎవరికి తెలుసు. శ్రీనివాస్ శరద్వతుల వివాహం తరువాత అతని జాడలేదు" నడుస్తూ నడుస్తూ అన్నాడు జయ్.

"ఒకవేళ విలియమ్స్ వచ్చినా, అతని రాక రాబీద్వారా తెలియాల్సిందే. ఒకవేళ రాబీ ఇవ్వాళో రేపో అమెరికాకి వెళ్ళిపోతానంటే?" అడిగాడు సుదర్శన్.

"అదీ జరిగితే, రాబీకి బదులుగా విలియమ్స్ శ్రీనివాస్ ద్వారా మనకి తెలుస్తాడు. కానీ, అలాగని నేను అనుకోను. రాబీ ఇండియాకి ఓ 'స్టడీ' కోసం వచ్చాడు. స్టడీ పూర్తి చెయ్యకుండా వెళ్ళడు. అంతమాత్రం ఖచ్చితంగా  చెప్పగలను. అమెరికన్ ఆంగ్లోరక్తంలోనే ఆ పట్టుదల ఉంటుంది" స్పష్టంగా అన్నాడు జయ్.

"నాకు అర్థంకానిది ఏమంటే, రాబీలో మానసిక మార్పు మొదలయింది తిరుపతిలో. అతను అన్‌కాంక్షస్‌గా తెలుగు మాట్లాడిందీ ఇక్కడే. ఆ తరువాత స్పృహలేని స్థితిలోనే అతన్ని వేరే చోటకి, ఆ తరవాత మా కొండకి తరలించారు. అతని వద్దనించి వచ్చిన సమాచారం ఒక్కటే, మహాభారతంలో వాడిన ఆయుధాల్ని చూశానని" ఓ క్షణం ఆగింది మదాలస.

"అవును" బాట పక్కన వున్న ఓ చిన్న రాళ్ళగుట్ట దగ్గర ఆగి అన్నాడు జయ్.

"మహాభారత సమయంలో తాను పాల్గొన్నానని అలంబసులవారన్నారు. ఓ మహాశిల వెలుగులీనుతూ మనకి లభించింది. ఇప్పటివరకూ మనకి ఖచ్చితంగా లభించిన సమాచారం ఇంతే. శ్రీనివాసు, శరద్వతుల వివాహం కూడా విలియమ్స్ డ్రైవర్‌ని ఆవహించి చెప్పడం వల్లనే, ...ఫ్యూచర్ సంగతి పక్కన పెడితే అవునా?" అన్నది మదాలస.

"యస్" ఒకేసారి అన్నారు జయ్, సుదర్శన్.

"ఇంకేదన్నా సమాచారం ఉందా?" అడిగింది మదాలస.

"ఉంది. తక్షపురం అనే గ్రామంలో జరిగిన సంఘటన, సర్పశిల వృత్తాంతం. పరమేశ్వర శాస్త్రిగారు ఆ సర్పశిలని చూశారు. అలాగే మట్టు శృంగిలకి ఓ మహాసర్పం దర్శనమిచ్చింది. దాని బారినించి కాపాడింది రామజోగి అని మట్టు అన్నాడు."

"జరిగినవన్నీ స్పష్టమైన సమాచారం క్రిందకి రావు. రాబీలో స్ప్లిట్ పర్సనాలిటీ ఉండొచ్చు" అన్నాడు సుదర్శన్.

"రాబీ డ్రైవర్ ఏడుకొండలు అచ్చు విలియమ్స్ అయ్యాడా/ లేక రాబీ వివరించిన విలియమ్స్ లా నాకు కనిపించడం వాస్తవమేగా?" అన్నాడు జయ్.

"రాబీ చెప్పిన మాట మీ మనసులో నాటుకుని ఏడుకొండలు (ఏళుమలై) ఆవిధంగా మాకు కనిపించి ఉండవచ్చు. సగం చీకటిలో పాము తాడులాగా, తాడు పాములాగా అనిపించవచ్చుగా. ఏళు మలై కలిస్తేకానీ విషయం నిర్ధారించలేము" బండలమీద తీరిగ్గా కూర్చుని అన్నాడు సుదర్శన్

"కరెక్ట్. డ్రైవర్ని మాట్లాడి పంపింది మీరేగా జయదేవ్ బాబూ. ఒక్కసారి ఆ కంపెనీకి కాల్ చేసి ఏళుమలైతో మాటాడితే? అసలు అతని ప్రస్తుత మనఃస్థితి తెలుసుకుంటే. ఎందుకంటే, విలియమ్స్ ఆవహించబట్టే ఏళుమలై అన్నాళ్ళు కారుతో ఉన్నాడు. మధ్యప్రదేశ్‌లో కూడా ఉన్నాడు. విలియమ్స్ ఆవహించనప్పుడు అతని ఆలోచనలు ఏమిటీ? కుటుంబం గురించి గుర్తు రాలేదా? ఇవన్నీ మెల్లగా అతని నోట పలికిస్తే, విలియమ్స్ అసలు నిజమైన ఆత్మా లేక మనం అంటున్న మన మనోబలహీనతలో ఊహించుకుంటున్నామో తేలుతుంది" జయ్ వంక చూస్తూ అన్నది మదాలస.

"ఇంకో విషయం జయ్, రామజోగి వృత్తాంతం మనకి పూర్తిగా తెలీదు. అది తెలిసింది పరమేశ్వర శాస్త్రిగారికి, శృంగికి, మట్టూకి. ఆయనసలు ఎవరూ? శృంగీ, మట్టూ, రామజోగిని 'మహాగురువు'లాగా భక్తి శ్రద్ధలతో కొలుస్తున్నారు. ఓ భూత భవిష్యద్వర్తమానాలు తెలిసిన మహా పురుషుడిగా భావిస్తున్నారు. అందరూ ఏదో రాబోతోంది .. ఓ మహా

ప్రళయం మానవుల్ని ముంచేస్తుంది అనే భ్రమలోనే ఉన్నట్టు నాకు అనిపిస్తోంది. ఈ భూమికి ప్రళయాలూ కొత్తకాదు.. ప్రళయానంతర నిర్మాణాలూ కొత్తకాదు. సరే, వారందరూ అనుకున్నట్టు ఓ మహా ప్రళయం వచ్చినా, దాన్ని ఏ శక్తితో ఎదుర్కోవాలీ? అసలా పెనుముప్పు ఎటువైపు నించి, ఎలా వస్తుందీ? ఏమీ తెలియకుండా, తెలుసుకోకుండా ఇలా వ్యర్ధంగా, ఓ యాక్షన్ ప్లాన్ లేకుండా కాలం గడపడం వల్ల ఏమి లాభం?" సుదర్శన్ స్వరంలో ధ్వనించిన తీవ్రత మదాలసకీ, జయ్‌కీ స్పష్టంగా గోచరించింది.

"నిజం. ఈ మొత్తం వ్యవహారంలో స్పష్టత ఏమీలేదు. స్పష్టంగా వివరించి చెప్పేవారూ లేరు. ఇదిలా ఉందంటే, ఇంటిప్లాన్ వేసుకోకుండా, స్థలాన్ని ఏర్పరుచుకోకుండా, ఇసుక, ఇనుము, ఇటుకలూ, సిమెంటూ, సున్నం అన్నీ తెచ్చి పెట్టుకుని ఓ చోట పోగేసినట్టు ఉంది. కానీ, సుదర్శన్‌జీ మనిషి కంటే మనసు శక్తి గొప్పది. మనసుకి తెలుసు... ఏదో విధ్వంసం జరుగుతుందని. ఆ ఎరుక అందరి మనసుల్లోనూ ఉన్నదన్న మాట మాత్రం కాదనలేని నిజం" ఇద్దరివంకా చూస్తూ అన్నది మదాలస.

"నూటికి నూరుపాళ్ళూ నిజం మదాలసా. ఏదో జరుగుతుందని మనసుకి తెలుసు. ఇన్నాళ్ళు ఇందరితో గడిపిన తరవాత నాకు ఒకటే అనిపిస్తోంది. మనం తీసుకున్నంత సీరియస్‌గా యీ ప్రళయాన్ని గురించి మిగతావారు ఎందుకు సీరియస్‌గా తీసుకోవడంలేదూ?" అన్నాడు సుదర్శన్.

"కారణం వారికి ఎటువంటి సూచనా లేదు గనక! ఎడారిలో వుండే వారికి కనీసం కొన్ని గంటల లేక నిముషాల ముందే తెలుస్తుంది. ఇసుక తుఫాను రాబోతోందని. ఎందుకంటే, వాతావరణంలో వుండే మార్పే వారికి ఇసుక తుఫాను గురించి చెబుతుంది. ఎస్కిమోలకీ తెలుసు. మంచు తుఫాన్ల గురించి. అడవిలో సంచరించేవారికే తెలుసు..... క్రూరమృగాలు వచ్చేప్పుడు మిగతా జంతువులు ఎలా ప్రవర్తిస్తాయో! అలాగే మనలోనూ కొందరికి అతి సున్నితమైన ప్రళయ సూచనలు అందివుండాలి. పరమేశ్వర శాస్త్రిగారికి, రామజోగికి, బహుశా?...." ఆగాడు జయ్.

"బహుశా?" రెట్టించాడు సుదర్శన్.

"యజ్ఞప్పగారికి" స్పష్టంగా అన్నాడు జయ్.

"ఓ గాడ్. మా తాతగారికా? నో..వే! అలాంటి ఛాన్సే లేదు" పకపకా నవ్వి అన్నది మదాలస.

"ఆయన బయటికి కనిపించే వ్యక్తికాదు. ఆయనలో లోతైన వ్యక్తి మరొకరున్నారు. అన్నిటినీ అంతటినీ అందరినీ గమనిస్తున్నారు. కానీ ఏదో స్పష్టంగా చెప్పని నిగూఢ తత్వం ఆయన మాటల్లో మనం గమనించవచ్చు" అన్నాడు జయ్.

అందరూ సైలంటయ్యారు.

"సుదర్శన్, మనం రాబీని కోమా స్థితిలో చూశాం. అతను స్వప్నావస్థలాంటి అవస్థలో మాట్లడటమూ విన్నాం. విలియమ్స్ అతన్ని ఆవహించడమూ చూశాం. అఫ్‌కోర్స్.. అవన్నీ భ్రమలు కాదని మనకి తెలుసు. ఒకవేళ భ్రమ అయితే, నిజం ఏమిటి? అది తేలకుండా మనం ఒక్క అడుగు కూడా ముందుకెయ్యలేం" అన్నాడు జయ్.

తలపంకించాడు సుదర్శన్.

చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. ఆ తరవాత మెల్లగా లేచి బయలుదేరారు. అల్లంత దూరంలో రామజోగి.

"అయ్యా నమస్తే" అన్నది మదాలస. చిన్నగా నవ్వాడు రామజోగి, "ఆయుష్మతీభవ" అని.

"కూర్చుని కూర్చుని విసుగుపుట్టి ఇలా వచ్చాం" అన్నది మళ్ళీ మదాలసే.

"నేను అర్థం చేసుకోగలను.... విసుగు తగ్గిందా?" అన్నాడు రామజోగి, చిరునవ్వు నవ్వుతూనే.

"నిజం చెబితే పెరిగింది" అన్నాడు సుదర్శన్.

"అదీ సాధ్యమే" అన్నాడు రామజోగి.

"అప్పుడేం చెయ్యాలీ?" అన్నాడు జయదేవ్.

"మనసు చెప్పింది చెయ్యాలి. ఎవరో ఏదో చెబితే చెయ్యాలనుకుంటాం. నిర్ణయాలు ఇతర్లకి వదిలేసి కేవలం ప్రేక్షకులుగా మిగలడానికి ఇష్టపడతాం. బాధ్యతని ఎగవేస్తాం. దానికి ఇతరుల్ని బాధ్యులుగా చూపిస్తాం. మన కష్టనష్టాలకీ, తర్జన భర్జనలకూ ఇతరులెలా బాధ్యులూ, ఆ విషయం ఆలోచించం."

సూటిగా ముగ్గుర్నీ చూసి అన్నాడు రామజోగి.

"మీరేం మాట్లాడుతున్నారో నాకు అర్థంకావడంలేదు. మేం మా బాధ్యతని మరిచిపోయామని అంటున్నారా? ఏ నిర్ణయాల్ని ఇతర్లమీదకి తోశాము?" తీవ్రంగా అన్నాడు సుదర్శన్.

"ఏం చెయ్యాలీ అని అడిగితే మనసు చెప్పింది చెయ్యగలది అని చెబుతూ, ఎందుకు మనసు చెప్పింది చెయ్యాలో వివరిస్తున్నా బాబూ! అంత కోపమెందుకూ?" రామజోగి మొహం మీద అదే చిరునవ్వు.

"సారీ.. నాది కోపం కాదు. నెలలుగా పేరుకున్న స్థబ్దతవల్ల వచ్చిన విసుగు" సిన్సియర్‌గా అన్నాడు సుదర్శన్ తనని తాను సంబాళించుకుని.

"ఒక రైతు పొలంలోనే కూర్చుని రోజుల తరబడి వర్షంకోసం ఎదురు చూస్తున్నాడు. కాలంలో దున్నకపోతే సర్వం వృధా అవుతుందని. దారేపోయే ఇంకో రైతు అన్నాడు "ఎంతకాలం పొలం గట్లమీద తిరుగుతావూ? నన్ను చూడు పొలం వదిలేసి పక్కూరిలో కూలీగా కుదురుకున్నా. వర్షం వచ్చినా రాకపోయినా నా జీతం నాకు ఠంచనుగా ముడుతుంది. నా మాట విని నువ్వూ వచ్చెయ్, యీ తిప్పలుండవు అని" ఆగాడు రామజోగి.

ముగ్గురూ వింటూ ఆలోచిస్తున్నారు యీ కథలోని మర్మం.

"ఈ కథలో మర్మం ఏమీలేదు. జీవితంలో ఎదురు తెన్నులు తప్పవు. వర్షం రావడం రైతు చేతుల్లో లేదు. కానీ వర్షం వచ్చి తీరుతుందని అతని నమ్మకం. అందువల్ల రైతు ఎదురుచూపుల్లో వుండేది నమ్మకమే తప్ప నిరాశ కాదు. రెండోవాడు తన భారాన్ని పక్కూరి ఆసామి మీద మోసేసి నిశ్చింతగా వున్నాడు. అదీ ఓ విధంగా సమంజసమే" నడక సాగించాడు రామజోగి.

"అంటే?" ఆగి అన్నాడు సుదర్శన్.

అర్థమైంది" నవ్వి అన్నది మదాలస, "మిమ్మల్ని ఏమని పిలవనూ?" అని కూడా అన్నది రామజోగితో.

"రామజోగీ అనొచ్చు.. రామయ్య అనొచ్చు, జోగయ్య అనొచ్చు. మా అమ్మ నన్ను అనంతయ్యా అనేది. ఆ పేరితోటీ పిలవొచ్చు" అన్నాడు రామజోగి.

"అనంతయ్య బాగుంది కానీ, మీరు పెద్దలు, విజ్ఞులు..."

"ఆపు తల్లీ ఆపు. అంత గొప్ప మాటలు వద్దు. నేనూ ఓ అజ్ఞానినే. మీలా నాకూ ఎదురు చూడటం అంతే విసుగే... కానీ, మొహంలో కనపడనివ్వను" పకపకా నవ్వి అన్నాడు రామజోగి. ఈ రామజోగి వేరు ఇందాక మాట్లాడిన రామజోగి వేరు అనిపించింది జయ్‌కి. మిగతా ఇద్దరూ రాంజోగి నవ్వులో నవ్వు కలిపారు.

"పరమేశ్వర శాస్త్రిగారూ, యజ్ఞప్పగారూ, ఇక్కడ కొందరికి సందేహాలున్నాయి.. సంశయాలున్నాయి. అలా వుండటం సహజాతి సహజం. ఒకటి: మనం అందరం ఎందుకు ఒకేచోట ఉండాల్సివస్తోంది. రెండు: అసలు దేనికి ఉండాలి? మూడు: ఈ నిరీక్షణ దేనికోసం? నాలుగు: ఈ నిరీక్షణకి అంతం ఎప్పుడు? ఈ నాలుగు ప్రశ్నలూ సబబైనవే. పెద్దవారిగా ముందు మీరు మాట్లాడండి.. ముఖ్యంగా యజ్ఞప్పగారిని కోరుతున్నా" అన్నాడు రామజోగి. సమాధానంగా నవ్వారు పరమేశ్వర శాస్త్రిగారు.

"అవును యజ్ఞప్పగారూ.. నాతో సహా అందరినీ మీ మనసుద్వారా ప్రేరేపించింది మీరే. జనాలకి తెలిసిన స్వప్నావస్థ చాలా తక్కువ. స్వప్నాన్ని స్వప్నంగా కొట్టిపారేసి జాగ్రదవస్థనే నిజం అనుకుంటారు. ఆ విషయంలో ఇప్పుడు చర్య అనవసరం. కానీ, మీ వివరణ అందరినీ శాంతపరుస్తుంది." అన్నారు పరమేశ్వర శాస్త్రిగారు.

"మనల్ని ప్రేరేపించింది యజ్ఞప్పగారా?" షాక్‌తో అన్నాడు సుదర్శన్. మదాలస అవాక్కయింది. మిగతావారంతా కూడా ఒక దిగ్భ్రాంతితో ఉన్నారు. రామజోగి చిరునవ్వుతో అందర్నీ చూస్తున్నాడు.

"సంకల్పం బీజం అయితే ఆ బీజం మొదటగా తొడుక్కునేది మనోశరీరాన్ని. కంటికి కనిపించే యీ శరీరం మనో శరీరానికి కేవలం ఆలంబన మాత్రమే. ఇది చెప్పడానికి చాలా సులువు. కానీ వివరించడం అనేది చాలా శ్రద్ధగా చెయ్యాల్సిన పని" ఓ క్షణం ఆగారు యజ్ఞప్ప అందరూ వింటున్నారు.

"ఇక్కడ వేచి చూస్తున్నవి శరీరాలు కాదు. మనో శరీరాలు. మనో శరీరం ఆధీనంలో ఉండేది జాగ్రత్త శరీరం. కానీ, మనో శరీరపూనికి గుర్తించడం, యీ శరీరాన్ని గుర్తించినంత సులువుకాదు. అవన్నీ పక్కన పెడితే, స్నేహితులారా మీ మనసుకి తెలుసు ఏం జరుగుతోందో. మనసుకి అనేక పార్శ్వాలు. ఒక్కటి మాత్రం ఇప్పుడు చెబుతా. మీ అందరి పుట్టుకా సామాన్యమైనది కాదు" అన్నారు యజ్ఞప్ప.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments